క్లుప్తంగా

ప్రజల జీవితాల్లో వెలుగులు తేవాలి

శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానమ్



డైరీని ఆవిష్కరిస్తున్న మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానమ్

రాయచోటి : ఈ నూతన సంవత్సరం ప్రజల జీవితాలలో కొత్త వెలుగులు తేవాలని, కోటి ఆశలతో సంవత్సరాదిని ఆహ్వానిస్తున్నామని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ మయాన జకియా ఖానమ్ అన్నారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు, అభిమానులు పూల మొక్కలు, స్వీట్ ప్యాకెట్లతో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల డైరీలు, క్యాలెండర్లను జకియా ఖానమ్ ఆవిష్కరించారు.

బదిలీపై వెళ్లిన అధికారికి సన్మానం



డా.కవితను బహుమతిని అందజేస్తున్న కమాండెంట్ శ్రీనివాసరావు

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో యూనిట్ మెడికల్ ఆఫీసర్ డా. కవిత బదిలీపై వెళ్లడంతో ఆదివారం ఆమెను సన్మానించారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా కమాండెంట్ ఎన్.శ్రీనివాసరావు కేక్ కట్ చేసి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు వి. కేశవరెడ్డి, కె. వెంకట్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగల్లు వద్ద పర్యాటకుల సందడి



పార్కులో కనిపిస్తున్న పర్యాటకుల తాకిడి

గాలివీడు : వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు వద్ద నూతన సంవత్సరం సందర్భంగా పర్యాటకుల సందడి కనిపించింది. నాలుగు జిల్లాల సరిహద్దులో ప్రాజెక్టు ఉండటంతో పర్యాటకులు భారీ సంఖ్యలో పాల్గొని గండిమడుగు, ఉమామహేశ్వరస్వామి దేవస్థానం, పార్కు, ప్రాజెక్టులోని నీటి మట్టాన్ని తిలకించారు. ఎస్ఐ శివకుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ



చిన్నంపల్లిలో వైఎస్సార్ పింఛన్‌ను పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ గజపతిరాజు

ఓబులవారిపల్లె : ప్రభుత్వం 1వ తేదీ నుంచి పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుకను మండల వ్యాప్తంగా సచివాలయ కన్వీనర్లు పంపిణీ చేశారు. సీఎం జగన్ చెప్పిన మాట ప్రకారం పింఛన్ రూ. 2,750 పింఛన్‌ను పంపిణీ చేశారు. చిన్నంపల్లి గ్రామంలో సచివాలయ కన్వీనర్ గజపతి రాజు పంపిణీ చేశారు. పెంచిన పింఛన్‌ను తీసుకున్న పింఛన్‌దారులు ముఖ్యమంత్రి తీరుపై హర్షం వ్యక్తం చేశారు. వలంటీర్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న వెల్‌విషర్స్ సభ్యులు

మదనపల్లె సిటీ : రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరాతమ్మ అన్నారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో నూతన ఆంగ్ల నూతన సంవత్సరాది పురస్కరించుకుని వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంతో నూతన సంవత్సరాన్ని ఆరంభించడం శుభ పరిణామని తెలిపారు. ప్రతి యువత ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం ఉన్న వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెల్‌విషర్స్ నిర్వాహకులు గిరీష్, సభ్యులు విజయ్, రెడ్డిశేషు, మురళీకృష్ణ, హరిబాబు, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన దాతలకు తిరుమల లడ్డులను అందజేశారు.

అభివృద్ధి దిశగా పరుగులు తీద్దాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడాకు శుభాకాంక్షల వెల్లువ



రాజంపేట రూరల్: ఆకేపాటికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు



రైల్వేకోడూరు అర్బన్: వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



లక్కిరెడ్డిపల్లె: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, నాయకులు



రాజంపేట రూరల్: కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేడా

రాయచోటి : కొత్త ఏడాదిలో ప్రజల జీవితాల్లో సుఖ, సంతోషాలు వెల్లివిరియాలని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి దిశగా పరుగులు తీద్దామన్నారు. గత ఏడాది తీపి, చేదు సంఘటనలను జ్ఞాపకాలుగా పెట్టుకుని కొత్త ఆశలతో నూతన ఏడాదిలో అభివృద్ధి వైపు సాగుదామని ఆయన ఆకాంక్షించారు. పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల క్యాలెండర్లను, డైరీలను శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. అనంతరం పలు ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజులను శ్రీకాంత్‌రెడ్డి వేర్వేరుగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లె...

లక్కిరెడ్డిపల్లె : ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ కేక్‌ను కట్ చేసి శ్రీకాంత్ రెడ్డికి గజమాల, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటికి శుభాకాంక్షల వెల్లువ

రాజంపేట రూరల్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి నాయకులు, కార్యకర్తలు, అధికారులు వెల్లువలా శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని ఆకేపాడులో ఉన్న ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటికి, జాతీయ రహదారిలోని మేడా నిలయంలో ఎమ్మెల్యే మేడాకు ఆదివారం ఉదయం నుంచి కార్యాలయాలు జాతరను తలపించాయి. అనంతరం కేక్‌లు కట్ చేసి, ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. నూతన సంవత్సరం అందరికీ సుఖ, సంతోషాలు కలుగజేయాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలపై దేవుని దీవెనలుండాలని ఆకాంక్షించారు.

జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్‌కు..

చిన్నమండెం : మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ దేవనాథరెడ్డి, ఎంపీపీ సుధామాధురికి ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : నూతన సంవత్సరం ప్రజల మోములో చిరునవ్వులు నింపాలని మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ ఛైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు.

సిద్దవటం : ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఉమ్మడి కడప జిల్లా జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషాలను ఆదివారం సిద్దవటం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పెనగలూరులో..

పెనగలూరు : నూతన సంవత్సర వేడుకలను ఆదివారం రాష్ట్ర స్కిల్ డెవలపెమెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి స్వగృహమైన కొండూరులో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి నాయకులు, కార్యకర్తలు, అధికారులు భారీ సంఖ్యలో పాల్గొని కేక్‌లను కట్ చేశారు. కొండూరు అజయ్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ విజయ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మలకు శుభాకాంక్షలు తెలియజేశారు.మండలాధ్యక్షులురాలు సౌందర్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, లేబాకు శ్రీనివాసులు రెడ్డి, బండి సానారెడ్డి, బచ్చల నరసింహారెడ్డి, గుండ్లూరు శివ, ఈశ్వరయ్య, కొండూరు సర్పంచ్ రామాంజులమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో..

రాజంపేట : ఏఐటీఎస్‌లో ఆదివారం న్యూ సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి కేక్‌కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ నారాయణ, సువర్ణలత, జయరామిరెడ్డి, ఏఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

రైల్వేకోడూరు అర్బన్ : నూతన సంవత్సరం పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, లూథరన్ చర్చిలలో కేక్‌లు కట్‌చేసి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు నాయకులు, అధికారులు, ప్రజలు కొరముట్లను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రామాపురంలో..

రామాపురం : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలకు మండలంలోని వైఎస్ఆర్‌సీపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం వైఎస్ఆర్‌సీపీ నాయకుల మధ్య కేక్‌ను కట్‌చేసి వారికి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, సూరం వెంకటసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబు, టీచర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన మహావిష్ణువుని ఆలయం

రామాపురం : అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మహావిష్ణువు దేవస్థానం మండలంలోని కంభరాయు నిగుట్టపై నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం గుండా మహావిష్ణువును దర్శించుకునే భాగ్యాన్ని భక్తులకు కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ ముక్కోటి బసిరెడ్డి, కుమ్మరపల్లె గ్రామ సర్పంచ్ ముక్కోటి భారతిలు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను చేసినట్లు వారు తెలియజేశారు.

నీటి సమస్య పరిష్కారం

రాయచోటి టౌన్ : పట్టణ పరిధిలోని అబ్దుల్ గఫూర్ మసీద్ సమీపంలో స్థానికుల నీటి సమస్యను పరిష్కరించడానికి జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్ చొరవ చూపారు. కాలనీవాసులు నీటి సమస్యపై తెలపడంతో స్పందించిన షరీఫ్ బోరు వేయించి చేతి పంపును బిగించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



బోరు వేయిస్తున్న సంస్థ సభ్యులు

భక్తులతో ఆలయాలు కిటకిట



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ

సంబేపల్లె : నూతన సంవత్సరాన్ని పురష్కరించుకొని మండలవ్యాప్తంగా ఉన్న ఆలయాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి. మండలంలోని దేవరరాయి నల్లగంగమ్మ, మోటకట్ల శివాలయం, గుట్టపల్లె వీరాంజనేయస్వామి ఆలయం, తిరుమలరాయిగుట్టలోని వెంకన్న ఆలయం, అడవికమ్మపల్లెలోని లక్ష్మీ వేంకటేశ్వరాలయం, సంబేపల్లెలోని పశుపతినాథ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సమీప ప్రాంతాల భక్తులు నూతన సంవత్సరం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పలు ఆలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం అందులోనూ ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు.

అనంతపురం గంగమ్మకు...

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గంగమ్మకు ఆదివారం వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తలనీలాలు అర్పించి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజులు భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టతను తెలియజేశారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

పుల్లంపేట : మండల పరిధిలోని కోటగడ్డపై ఉన్న అభయాంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం, నూతన సంవత్సరం కావడంతో ప్రజలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

క్యాలెండర్‌లు, డైరీల ఆవిష్కరణ



పుల్లంపేట: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్



సిద్దవటం: ఎస్టీయూ ఏపీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శంకరయ్య

పుల్లంపేట : రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కోదండరామిరెడ్డి, ఏపీ రెవెన్యూ ప్రెసిడెంట్, తహసీల్దార్ నరసింహ కుమార్, చిట్వేలి, పెనగలూరు చెందిన తహసీల్దార్లు, ఆర్ఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దవటం : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఆదివారం ఎస్టీయూ ఏపీ క్యాలెండర్, డైరీలను ఎంఈఓ శంకరయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఎంఈఓను సన్మానించారు. ఎస్టీయూ ఏపీ సిద్దవటం మండల అధ్యక్షుడు తులసీధర్, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సి.వి. సుధాకర్, ఫయాజ్, గంగాధర్, సురేష్, చంద్ర పాల్గొన్నారు.

పీఎస్‌టీయూ డైరీ ఆవిష్కరణ

రాయచోటి టౌన్ : పీఎస్‌టీయూ (ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) డైరీని కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జకియా ఖానం, ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి చేతుల మీదుగా వివిధ ప్రాంతాల్లో ఆవిష్కరించారు. అధికారులందరికీ పీఎస్‌టీయూ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు పప్పిరెడ్డి చిన్నరెడ్డన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ మజరుల్ హక్, మహమ్మద్ గౌస్, హబీబుర్‌హాన్, రియాజ్, సయ్యద్ బాషా, సిబక్‌తుల్లా, కరీముల్లా ఖాన్, ఎస్ఎండీ జక్రియాబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రకృతి సోయగం



ఆహ్లాదభరితంగా ఉన్న వత్తలూరు మార్గం

రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీదుగా వత్తలూరుకు వెళ్లే మార్గం ప్రకృతి రమణీయతకు అద్దం పడుతుంది. ఆ ప్రాంతంలో దాదాపు అరకిలోమీటరు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు పచ్చగా సొరంగం ఆకారంలో ప్రజలకు కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గం గుండా ప్రయాణించే వారికి ఆహ్లాదాన్ని, హాయిని కల్పిస్తున్నాయి. అన్ని మార్గాల్లోనూ చెట్లను పెంచి ప్రయాణాన్ని ఆహ్లాదంగా ఉండేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. – రాజంపేట టౌన్

మెకానిక్‌లకు చేయూతనందిస్తాం

రాజంపేట రూరల్ : టూ వీలర్ మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించి వారికి చేయూతనిస్తామని రాజంపేట టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామ్మోహన్ తెలియజేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు.

భీమ్ కోరేగావ్ యుద్ధవీరులకు నివాళి

పీలేరు : వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భీమ్ కోరేగావ్ యుద్ధ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద భీమ్ కోరేగావ్ యుద్ధం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ భీమ్ కోరేగావ్ యుద్ధం జరిగి నేటికి 205 సంవత్సరాలు అయ్యిందన్నారు. అంబేడ్కర్ తన మరణం వరకు ప్రతి ఏటా ఇదే రోజున విజయస్తూపం వద్ద నివాళులర్పించేవారని తెలిపారు. మన వీరుల గాథలు పిల్లలకు తెలియజేయాలని కోరారు.

క్రీస్తు దీవెనతో కొత్త జీవితాలు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు అందజేస్తున్న దీవెనలతో విశ్వాసులంతా కొత్త జీవితం ప్రారంభించాలని, ఆయన చూపిన మార్గంలో పయనించాలని పాస్టర్ మత్తయ్యబాబు సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం స్థానిక సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బైబిల్ నుంచి వాక్య పరిచర్య చేశారు. కార్యక్రమంలో చర్చికమిటీ సభ్యులు, ఇతర అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన

- ఇచ్చిన మాట ప్రకారం పెంచిన డబ్బులతో పింఛన్ పంపిణీ
- ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల

రాయచోటి : అవ్వాతాతలు, అండదండలు లేనివారి ఆనందమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి రూరల్ మండలానికి మంజూరైన నూతన పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపీడీఓ మల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. ఏ ఒక్క పెన్షన్ తొలగించకుండా కొత్త పెన్షన్లను మంజూరు చేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా నిరూపించారన్నారు. పెన్షన్లపై మాట్లాడే అర్హత ప్రతిపక్షానికి లేదన్నారు. నేడు అన్నమయ్య జిల్లాకు నూతన పెన్షన్లు 7020 మంజూరు అయ్యాయని, రాయచోటి నియోజకవర్గానికి నూతన పెన్షన్లు 1207 మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర రెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, మదనపల్లె వైఎస్సార్‌సీపీ పరిశీలకులు హబీబుల్లా ఖాన్, తిరుపాల్ నాయుడు, దివాన్, ఖాదర్ వలీ పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు : పేద ప్రజలు, వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దృష్టిలో పెట్టుకుని మద్దతు ఇవ్వాలన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు, పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా 939 పింఛన్లు మంజూరైన వారికి ఒకటవతేదీనే పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీఓ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజంపేటలో కొత్త పింఛన్‌ల పంపిణీ

రాజంపేట టౌన్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 8:30 గంటలకు నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్‌లను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఎంపీడీఓ బాలమునుస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేరకు ఈకార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

జూదరుల అరెస్టు

తంబళ్లపల్లె: మండలంలోని కోటకొండ ఎగువసుగాలితండా వద్ద ఆదివారం కోడిపందెం ఆడుతున్న వారిపై ఎస్ఐ రామకృష్ణారెడ్డి సిబ్బందితో దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12 వేల నగదు, మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్

పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఏసీఎల్ఎం చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులకు, పిల్లలకు బహుమతులు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ బి. జెర్మియా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఏసుప్రభువు ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.